క్లుప్తంగా

పూడికతీత పనులు ప్రారంభం

తాడేపల్లి రూరల్: రానున్న వర్షాకాలంలో మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు కార్పొరేషన్ అధికారులు ప్రతి ప్రాంతంలోను డ్రైనేజీల్లో పూడికతీత పనులను ప్రారంభించారు. శుక్రవారం పెనుమాకలోని ప్రధాన రహదారి వెంబడి డ్రైనేజీలో పూడికతీత పనులు ప్రారంభించినట్లు డీఈ రాము తెలిపారు. ఇప్పటికే మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారుల్లో ఉన్న డ్రైన్లలో పూడికతీత పనులు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

పురుగుల నివారణకు మందు పిచికారీ

సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని యూపీహెచ్‌సీ సమీపంలో 'అపరిశుభ్రంగా మురుగు కాలువ' అంటూ సాక్షిలో శుక్రవారం కథనం వెలువడింది. దీనిపై స్పందించిన కమిషనర్ అలీంబాషా సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. అక్కడ డ్రైనేజీని పరిశీలించి వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్మికులు డ్రైనేజీని క్లీన్ చేసి పురుగుల నివారణకు మందు పిచికారీ చేశారు. దీంతో పాటు బ్లీచింగ్ చల్లారు. స్థానికులు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కళాశాలలో యోగాసనాల ప్రదర్శన



దుగ్గిరాల: 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలను ప్రదర్శించారు. శుక్రవారం దుగ్గిరాల డా.కేఆర్ఎం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.గిరిధరరావు అధ్యక్షతన యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగాసనాలను అలవాటు చేసుకోవాలని.. మన జీవన శైలిలో యోగా ఒక భాగం కావాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాఘవ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాంబాబు, అధ్యాపకులు కె.సరళాదేవి, ఎస్.వాసుదేవ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు బహూకరణ



దుగ్గిరాల: పేరుకలపూడి హరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్‌లను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బి.మరియదాసు అందజేశారు. తమ తండ్రి బుల్లా సుబ్బారావు జ్ఞాపకార్థం వాటిని ఉచితంగా అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సభ్యులు ఎ.రాధాకృష్ణ, భాజావారి పాలెం హెచ్ఎం వి.మేరిగోల్డ్, ఉపాధ్యాయులు జి.ప్రదీప్‌భూషణం, తదితరులు పాల్గొన్నారు.

తెనాలి ఘటనపై నిరసన



తాడేపల్లి రూరల్: తెనాలి అయితా నగర్‌లో జరిగిన పోలీసుల అమానవీయ చర్యను ఖండిస్తూ తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో కుల వివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జొన్నకూటి నవీన్ ప్రకాష్ మాట్లాడుతూ.. పోలీసులు తమ హీరోయిజాన్ని ప్రదర్శించడం కోసం దళిత, మైనార్టీలపై అక్రమ కేసులు బనాయించి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఆదేశాలను కూడా పోలీసులు లెక్కచేయకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్నారని విమర్శించారు. తెనాలి పోలీసుల చర్యల పట్ల మౌనంగా ఉంటే ప్రజాస్వామ్యంలో ప్రజల మనుగడే ప్రశ్నార్థకం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, బి.ప్రభాకర్, చిన్ని దుర్గారావు, మహేష్, శ్రీకాంత్, అంకయ్య, నవనీతమ్మ, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత డ్రైనేజీలు నిర్మించాలని వినతి

మంగళగిరి: ఆత్మకూరు దళితవాడలో అంతర్గత డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో నగర పాలక సంస్థ కమిషనర్ అలీంబాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితవాడలో అంతర్గత డ్రైయిన్‌లు లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లపై మురుగు చేరి విష పురుగులు వస్తున్నాయన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో స్థానికులు పులివర్తి శ్రీనివాసరావు, పులివర్తి రాంబాబు, జాలాది ప్రేమ్‌చంద్, బండపల్లి బాపయ్య తదితరులున్నారు.

యోగా దినోత్సవానికి సర్వం సిద్ధం

నేడు ఎంటీఎంసీ పరిధిలో 265 కేంద్రాలలో యోగా దినోత్సవం

మంగళగిరి: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ(ఎంటీఎంసీ) పరిధిలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎంటీఎంసీ పరిధిలో మొత్తం 265 కేంద్రాలలో యోగా నిర్వహించేందుకు అధికారులు విరివిగా ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాలు ఉదయమే 8 గంటలకు ముగియనున్నాయి. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని సచివాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు.

ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు..

ఎంటీఎంసీ పరిధిలోని ఆలయాలు, కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాలులలో యోగా దినోత్సవం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. నగర పాలక సంస్థ కమిషనర్ అలీంబాషా, అడిషనల్ కమిషనర్ శకుంతల, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, రెవిన్యూ, మిగిలిన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఏర్పాట్లకు సర్వం సిద్ధం చేశారు. కార్యక్రమాలలో నగర ప్రజలంతా పాల్గొని యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అధికారులు కోరారు. యోగా ఒక్క రోజు మాత్రమే కాకుండా దినచర్యలో భాగంగా చేసుకుని ప్రతి రోజు యోగా చేయడంతో ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత నెలకొంటుందని యోగా గురువులు తెలిపారు.



శ్రీ లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లు

విజయవంతం చేయాలి..



శనివారం యోగా దినోత్సవం సందర్భంగా ఎంటీఎంసీ పరిధిలో మొత్తం 265 కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రతి రోజూ ప్రజలు యోగా చేయాలి. యోగాను తమ దినచర్యలో భాగం చేసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. అందుకనుగుణంగా కొన్ని కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు యోగా గురువులను నియమించేలా చర్యలు తీసుకోనున్నాం. శనివారం ఉదయం 6 గంటలకు ప్రజలంతా ఆయా కేంద్రాలకు చేరుకుని యోగాలో పాల్గొనాలి. 8 గంటల వరకూ ఆయా కేంద్రాలలో యోగా గురువుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలి. అలీంబాషా, కమిషనర్, ఎంటీఎంసీ

మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ రవికుమార్

తాడేపల్లి రూరల్: మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యత అని గుంటూరు అడిషనల్ ఏఎస్పీ ఏటీవీ రవికుమార్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రవికుమార్ మాట్లాడుతూ.. నేరాలు జరిగిన తరువాత కేసులు కట్టడం కంటే నేరాలు జరగకుండా నివారించడమే ముఖ్యమని అన్నారు. మంచి అలవాట్లు అలవరచుకోవడం ప్రతి విద్యార్థి కర్తవ్యమని సూచించారు. మంగళగిరి నార్త్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ఫలితాల గురించి అవగాహన పెంచుకుని ఇతరులకు తెలియజేయాలని సూచించారు. వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ.. తమ వర్శిటీలో ఎటువంటి ర్యాగింగ్ లేకుండా ప్రతి విద్యార్థి ఎంతో సంతోషంగా, భద్రంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు, వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, అసోసియేషట్ డీన్ డాక్టర్ శ్రీధర్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ వి.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హామీని అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: మంత్రి నారా లోకేశ్ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షకు ఆయన సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ.. కార్మికులు గత 199 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నారని.. అయినా ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించకపోవడం విచారకరమని అన్నారు. ఎన్నికల ప్రచారంలో నారా లోకేశ్ తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, పిచ్చయ్య, గురవయ్య, నాగేశ్వరరావు, హగ్గయ్యలు, మాణిక్యరావు, షేక్ బాషా, షేక్ సుభాని, ఇమాంబీ, శివకుమారి, దుర్గాభవాని, రమణ, సారమ్మ, బి.సూర్యప్రకాశరావు, వై.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో వేముల దుర్గారావు

మరమ్మతులకు నోచుకోని ట్రాన్స్‌ఫార్మర్



నిడమర్రు(మంగళగిరి): మండలంలోని నిడమర్రు, చినకాకాని గ్రామాల మధ్య గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైయ్యింది. మూడు రోజుల కిందట పాడైన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసేందుకు అధికారులు ముందుకు రావడంలేదు. దీంతో స్థానిక ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లేకపోవడంతో కూరగాయలు, పూలతోటలు వాడిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. వర్షాలు లేకపోగా ట్రాన్స్‌ఫారం మరమ్మతులకు గురికావడంతో పూలతోటలు, కూరగాయల పంటలు వాడిపోతున్నాయని.. వెంటనే అధికారులు ట్రాన్స్‌ఫారంకు మరమ్మతులు చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులకు కృతజ్ఞతలు

తాడికొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శిగా తుళ్లూరు మండలం మందడం గ్రామానికి చెందిన బేతపూడి రాజేంద్రను నియమించిన సందర్భంగా శుక్రవారం ఆయన జిల్లా పార్టీ అధ్యక్షులు అంబటి రాంబాబును పలువురు నాయకులతో మర్యాద పూర్వకంగా కలిశారు. తమపై నమ్మకంతో పార్టీ పదవిని అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. పార్టీ అభివృద్ధికి ప్రచార విభాగం ద్వారా తనవంతు కృషి చేసి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి పాటుపడతానని తెలియజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి బత్తుల కిషోర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు కొరిటిపాటి ప్రేమ్ కుమార్, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులు దానం వినోద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శేషగిరిరావు, పలు విభాగాల అధ్యక్షులు పఠాన్ సుభాన్ ఖాన్, షేక్ భాషా, ఆరేపల్లి జోజి, ఆలోకం సురేష్, డీజే శ్రీనివాస్, ఆలూరి శ్రీనివాసరావు, పులి మాణిక్యరావు, పులి ప్రకాష్, జానీ భాషా, పి జగదీష్, జి కోటేశ్వరరావు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అంబటి రాంబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న రాజేంద్ర

విద్యార్థులతో యోగాసనాలు!

ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల పరిషత్ పాఠశాల విద్యార్థులు యోగాసనాలు వేశారు. స్థానిక కోటి లింగాల క్షేత్రంలోని రాతి మండపంలో విద్యార్థులతో హెచ్ఎం శ్రీనివాస కార్తిక్ యోగసనాలు వేయించి.. వేసే పద్ధతులు, వాటితో కలిగే ఉపయోగాలు వివరించారు. విద్యార్థులు యోగాసనాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సుబ్బయ్య, ఉపాధ్యాయుడు దివి. కమల్‌మోహన్, శేషురవి ఉన్నారు.

- ఫిరంగిపురం



పవర్ లిఫ్టింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మంగళగిరి టౌన్: ఈనెల 22వ తేదీ నుంచి జరిగే జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సంధానీలు తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రంలోని దావనగిరి పట్టణంలో ఆదివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు జరిగే నేషనల్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ (మెన్, ఉమెన్) పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను జిల్లాకు చెందిన 12 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఉమెన్స్ సబ్ జూనియర్ టీమ్‌లో అంజలి (69 కేజీల విభాగం), లిఖిత (76 కేజీల విభాగం), వినయశ్రీ (84 కేజీల విభాగం).. ఉమెన్ జూనియర్ టీమ్‌లో షానూన్ (47 కేజీలు), సాదియా ఆల్మాస్ (76 కేజీలు), షబ్బీనా, జ్ఞానదివ్య (84 కేజీలు).. మెన్ సబ్ జూనియర్ టీమ్‌లో మణిచంద్ (74 కేజీలు), మునీశ్వర్ రామ్ (84 కేజీలు).. మెన్ జూనియర్ టీమ్‌లో జమీల్ ఖాన్, పృథ్వీకుమార్ (105 కేజీలు).. సీనియర్ ఉమెన్ కేటగిరిలో బి.చంద్రిక (84 కేజీలు)లలో పోటీ పడతారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ సభ్యులు అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులు

ఉచిత వైద్య శిబిరం

మంగళగిరి టౌన్: నారా భువనేశ్వరి జన్మదినాన్ని పురస్కరించుకుని లక్ష్మీ ఆరుష్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్, మెడ్‌స్టార్ హాస్పిటల్స్ వైద్యుల సహకారంతో మంగళగిరి నగర పరిధిలోని వైష్ణవి కల్యాణ మండపంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సుమారు 700 మందికి వైద్య సేవలు అందజేశారు. రోగులకు పలు వైద్య పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, వైద్యులు శ్రీహరి, హేమేశ్వరరావు, సందీప్, ప్రశాంత్, నీలిమ, గౌతమ్‌కృష్ణ, రాకేష్‌లతో పాటు మంగళగిరి పట్టణ, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ డేలో బాధను వెళ్లగక్కిన బీజేపీ మండల అధ్యక్షులు



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని నులకపేట తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం జరుగుతుండగా బీజేపీ మండల అధ్యక్షులు ఈశ్వర్ నాయుడును మాట్లాడాల్సిందిగా కోరారు. ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కలిసి పోటీ చేశాయని.. కానీ ఈ రోజు రెవెన్యూ డే సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో ప్రధాని మోదీ ఫొటో లేదా.. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఫొటో కానీ పెట్టకపోవడం చాలా బాధాకరమని అన్నారు. బహుశా అధికారులు, నాయకులు మర్చిపోయారేమో గమనించాలని ఆయన సున్నితంగా తన బాధను వెళ్లగక్కారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

మంగళగిరి టౌన్: దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారులు పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఎస్ఎస్ టాలెంట్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మలేరియా నివారణపై అవగాహన కల్పించారు. మలేరియా మహోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు ఎక్కువగా ఉంటాయని.. నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మంగళగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్లు సాగర్, సైదులు, హెల్త్ అసిస్టెంట్లు కడియం శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపాల్ పార్వతి, మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కేఎల్‌యూలో అగ్నిమాపక సిబ్బందికి శిక్షణ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో అగ్నిమాపక సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్‌యూ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ అసోసియేట్ డీన్ కె.బ్రహ్మాచారి మాట్లాడుతూ.. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని నాగ్‌పూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజ్ నుంచి సబ్ ఆఫీసర్ ట్రైనీల కోసం సమగ్ర ఆచరణాత్మక శిక్షణ కార్యక్రమాన్ని హ్యాండ్స్ ఆన్ ఫైర్ సేఫ్టీ శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. భారతదేశంలోని పలు రాష్ట్రాల నుంచి 30 మంది సబ్ ఆఫీసర్ ట్రైనీలను ఒక్కచోట చేర్చి వారికి పలు విధానాలు, విలువైన ఆచరణాత్మక అనుభవాల గురించి అవగాహన కల్పించారని తెలిపారు. కార్యక్రమానికి గన్నవరం అగ్నిమాపక కేంద్రం నుంచి అనుసంధాన అధికారి ఎస్‌కె. జాన్‌అహ్మద్ సమన్వయం చేయగా శిక్షణలో భాగంగా పాల్గొన్న వారు క్యాంపస్‌లో పర్యటించి, అగ్నిమాపక భద్రతా మౌలిక సదుపాయాలను సమీక్షించారు. కార్యక్రమంలో కేఎల్‌యూ ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ప్లానింగ్, డెవలప్‌మెంట్ విభాగం డీన్‌లు డాక్టర్ వి.రాజేష్, డి.శేషిరెడ్డి, వై.మౌళిచంద్, సీనియర్ డైరెక్టర్ కమాండ్ జి.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమానికి హాజరైన పలు రాష్ట్రాలకు చెందిన అగ్నిమాపక సిబ్బంది

రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడండి

మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాల గుట్టలు లేకుండా చూడాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. మారీసుపేటలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాలను ప్రతి రోజు ఉదయం తొలగించాలని సూచించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే

ఫిరంగిపురం: మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ జె.ప్రసాదరావు మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సేవలు అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. అనంతరం ఇటీవల పదవీవిరమణ పొందిన బి.శాంతకుమారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మేడికొండూరు: అన్ని వ్యవస్థలలో రెవెన్యూ వ్యవస్థ ఎంతో బాధ్యతాయుతమైనదని తాడికొండ నియోజకవర్గ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని మేడికొండూరు తాహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే కార్యక్రమాన్ని తహసీల్దార్ హరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థలోని మార్పులపై వివరించారు. ఈ సందర్భంగా పదవీవిరమణ చేసిన తహసీల్దార్ పద్మనాభుడు, మల్లికార్జునరావులను ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం రెవెన్యూ వ్యవస్థలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి డేవిడ్ ప్రభాకర్, మండలంలోని గ్రామ వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

విజ్ఞానాన్ని పెంచుకుంటే అద్భుతమైన ఫలితాలు

మంగళగిరి టౌన్: ప్రతి రెవిన్యూ ఉద్యోగి రోజురోజుకు విజ్ఞానాన్ని పెంపొందించుకుని విధులు నిర్వహిస్తే అద్భుతమైన ఫలితాలుంటాయని మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవిన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో రెవిన్యూ శాఖ అత్యంత కీలకమైనదని అన్నారు. సమాజంలో ఏ సంక్షోభం ఎదురైనా తొలుత రెవిన్యూశాఖ స్పందించి సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. అనంతరం రెవిన్యూ డేలో పాల్గొన్న రైతులకు అడంగల్, వన్‌బీలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్వో కార్యాలయ అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్వో దినేష్‌రాఘవేంద్ర

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ఫిరంగిపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లంవారిపాలెం గ్రామానికి చెందిన ఆఖ్యం వెంకటశివరాం(23) తాపీ పనిచేస్తూ జీవిస్తుంటారు. కాగా ఈనెల 18వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో పని మీద ఫిరంగిపురం ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా బండి అదుపుతప్పి పడిపోయారు. తీవ్రంగా గాయాలు కావడంతో బంధువులు అతడిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందాడు. భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.శివరామకృష్ణ తెలిపారు. మృతుడికి ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగ సంఘ తెనాలి అధ్యక్షుడు షేక్ జానీబాషా, కార్యదర్శి ధర్మేంద్ర సాయి, ఉపాధ్యక్షుడు నున్న అజయ్‌కుమార్‌లు కోరారు. శుక్రవారం అమరావతిలోని గ్రామ/వార్డు సచివాలయ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ శివ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు కృష్ణంరాజు

తాడికొండ: రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యల కేసులో రిమాండ్‌లో ఉన్న కృష్ణంరాజును శుక్రవారం తుళ్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై ఉన్న నేపథ్యంలో మూడు రోజుల విచారణ నిమిత్తం కోరగా కోర్టు అనుమతి లభించింది. జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనను కస్టడీలోకి తీసుకొని జీజీహెచ్‌లో వైద్య పరీక్షల అనంతరం వెలగపూడిలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు విచారణ నిమిత్తం తీసుకొచ్చారు.